ఒడిస్సా రైతుల కృషి

సహజసిద్ధ పద్ధతుల్లో భూసార పునరుద్ధరణ

ప్రారంభంలో బయో ఫెర్టిలైజర్స్ వినియోగంతో కాయగూరలు పండించి కుటుంబ అవసరాలు తీర్చుకున్నఒడిస్సారాష్ట్రానికిచెందినఅలాదిపుర్‌గ్రామ రైతుల్లో అనేక మంది ఇప్పుడు మార్కెట్ అవసరాలకు తగినట్లుగా కాయగూరలను పండించేందుకు సేంద్రీయ సేద్యాన్ని అనుసరిస్తున్నారు. నాణ్యమైన ఆహారం అందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ బాధ్యతనుకూడావారుఇప్పుడుసమకూరుస్తున్నారు. సేంద్రీయ పద్ధతులకు మళ్ళడం ద్వారా వారు ఉత్పాదన ఖర్చులను తగ్గించుకోగలుగుతున్నారు. స్వయం సమృద్ధి సాధించగలుగుతున్నారు

''కుటుంబంలోని పది మంది సభ్యులకు ప్రతి రోజూ అయిదు వేళ్లూ నోటిలోకి వెళ్లాలంటే.. నిత్యం ఆహారం అందించాలంటే.. అందుకు అవసరమైన అధిక ఉత్పత్తి సాధించేందుకు నాకు రసాయన ఎరువుల వినియోగం తప్ప మరో మార్గం కనిపించలేదు'' అంటూ తన ఆవేదన వ్యక్తం చేశారు 55 ఏండ్ల రైతు బి.రెడ్డి. ఒడిస్సాలోని చాలా రైతు కుటుంబాల సమస్య ఇదే. అందరితో పాటు రెడ్డి కూడా తన వ్యవసాయంలో రసాయని ఎరువుల వినియోగాన్ని పెద్ద ఎత్తునే ప్రారంభించాడు. నిజానికి ఆయన ఈ విధంగా రసాయనాల వేపు దృష్టి పెట్టి గట్టిగా ఏడాది మాత్రమే అయింది. మరింత ఎక్కువ మొత్తంలో ఆహారం ఉత్పత్తి చేయాలన్నదే ఆయన ఆలోచన. ప్రారంభంలో ఈ పద్ధతి మంచి ఫలితాలనే ఇచ్చింది. అయితే రోజులు గడిచే కొద్దీ భూసారంలో తేడా వస్తున్నట్టు ఆయన గమనించారు. మిగిలిన రైతులకు కూడా ఇదే అనుభవం ఎదురైంది. రసాయనిక ఎరువుల వినియోగం మొదలెట్టిన కొన్ని సీజన్ల తరువాత దిగుబడి తగ్గడమే కాదు, భూసారం దెబ్బతింటున్నదనీ, క్రమంగా తగ్గిపోతున్నదనీ వారు గుర్తించారు.

ఈ పరిస్థితులలో ఒడిస్సా రైతుల పాలిట ప్రభుత్వేతర సంస్థ వ్యూస్ మార్గాంతరాలను చూపించింది. ఆహార భద్రతను సంపాదించుకునేందుకు బడుగు బక్క రైతులకు అండగా నిలిచింది. అలాదీపూర్ (చీక్తీ బ్లాక్) గ్రామంలోని చాలా మంది రైతులు కూరగాయలను సాగు చేసేందుకు రసాయనాలను వినియోగించారు. వారిలో రెడ్డి కూడా ఒకరు. ఫలితంగా వారి మనుగడే ప్రశ్నగా మారింది. రైతు కుటుంబాల అవసరాన్ని గుర్తించిన వ్యూస్ సంస్థ 2014లో జనవరి నుంచి జూన్ వరకు రైతులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపట్టింది. విస్తృత ప్రాతిపదికపై సమగ్ర రైతు ప్రయోజనాలకు అనుగుణంగా సేంద్రీయ ఎరువుల తయారీ విధానాలలో శిక్షణ ఇవ్వడమే కాకుండా వాటి ప్రయోజనాలను వారికి పూర్తిగా వివరించింది. అలాదీపూర్ గ్రామం నుంచి రెడ్డి, ఇతర రైతులు ఈ కార్యక్రమాలకు హాజరయ్యారు. మొత్తం 24 మంది రైతులు శిక్షణ పొందారు. అలాదీపూర్ శిక్షణ విజయవంతం కావడంతో పరిసరాల్లో గంజాం జిల్లాలో ఉన్న మరో 20 గ్రామాలకు కూడా ఈ శిక్షణ కార్యక్రమాలను విస్తరించారు.

ఒడిస్సాలో సుస్థిర జీవనోపాధుల కల్పన లక్ష్యంగా చేపట్టిన ఈ ప్రాజెక్టుకు అంతర్జాతీయ రైతు సహాయక సంస్థ గంజాం జిల్లాలోని మూడు బ్లాకులను తన కార్యాచరణకు ఎంపికచేసుకుంది. అందులో భాగంగానే వ్యూస్ సంస్థ కూరగాయల పెంపకంలో బయో ఫెర్టిలైజర్స్ వాడకాన్ని ప్రోత్సహించేందుకు శిక్షణ కార్యక్రమాలు చేపట్టింది. ప్రారంభ దశలో ఈ కార్యక్రమంలో గృహావసరాలకు అవసరమైన కూరగాయల సాగు వరకే బయో ఫెర్టిలైజర్స్ వాడకాన్ని ప్రతిపాదించింది. శిక్షణ తరువాత, రైతు కుటుంబాలకు టమోటా, బెండ, కాకరకాయల పెంపకానికి అనువైన విత్తనాలు అందించింది. రెడ్డితో పాటు ఇతర రైతులు ఈ విధంగా సేంద్రీయ ఎరువులతోనే కాయగూరలు సాగుచేపట్టారు. ఫలితాలు ప్రోత్సాహకరంగా కనిపించాయి. రసాయనిక ఎరువులను ఉపయోగించకపోయినా దిగుబడి రైతు కుటుంబాలకు సంతోషం కలిగించింది. దీంతో ఇంట్లో వాడకానికి మాత్రమే కాకుండా స్థానిక మార్కెట్లలో విక్రయించుకునేందుకు కూడా కూరగాయల సాగును వారు చేపట్టారు. వినియోగదారుల నుంచి అందిన సానుకూల ధోరణి కారణంగా సేంద్రీయ ఎరువులను ఉపయోగించడం వల్ల కలిగే ప్రయోజనాలపై వారిలో మరింత గట్టి విశ్వాసం ఏర్పాడింది. ఇక వినియోగదారులు కూడా ఈ విధంగా సేంద్రీయ ఎరువుల ఆధారంగా పండించిన కూరగాయలు ఎక్కువ రుచికరంగా ఉన్నట్లు గుర్తించారు. మెల్లిగా స్థానిక మార్కెట్‌లో ఈ రైతులు సేంద్రీయ సేద్యం ద్వారా పండిస్తున్న కూరలకు మంచి డిమాండ్ ఏర్పడింది. రసాయన ఎరువులతో పండించిన బెండకాయల విక్రేతలు కిలోకు రూ.25/- సంపాదించుకున్నారు. అదే సమయంలో సేంద్రీయ ఎరువులతో పండించిన రైతులకు కిలోకు రూ.35/- లభించింది. సేంద్రీయ విధానంలో ఈ సానుకూల ప్రయోజనాలతో పాటు పర్యావరణ కాలుష్యాన్ని నియంత్రించగలిగింది. వారు పండించిన కూరగాయలు నాణ్యత పరంగా అందరి మెప్పును పొందగలిగాయి. రెడ్డి, ఇంకా ఇతర రైతులకు స్వయం సమృద్ధి ఏర్పడింది. వ్యవసాయ ఖర్చులు గణనీయంగా తగ్గిపోయాయి.

◆

ఆంగ్లమూలం :
లీసా ఇండియా, సంపుటి 20, సంచిక 2, జూన్ 2018